# రైతు డిస్కమ్ పేరుతో సర్కార్ దగా




- రైతు డిస్కమ్ ప్రతిపాదన వ్యవసాయ రంగానికి ఎండ్రిన్ పోయడమే
- రైతులకు అన్యాయం చేసి 1999 నాటి కాల్పుల ఘటనను కొని తెచ్చుకోవద్దు
- మంచి నిర్ణయమైతే ఆరు నెలల పాటు రహస్యంగా ఎందుకు ఉంచారు?
- ఈఆర్సీ ఈ ప్రజా వ్యతిరేక ప్రపోజల్‌ను తక్షణమే తిరస్కరించాలి
- పబ్లిక్ హియరింగ్‌లో కవిత ధ్వజం

**ప్రజానావ, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు డిస్కం పేరుతో తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచేందుకు కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రైతులు ఎవరూ అడగకుండానే విద్యుత్ సంస్కరణల పేరుతో చేపట్టిన ఈ చర్య అన్నదాతల పాలిట శాపంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా ప్రతిపాదిస్తున్న ఈ డిస్కమ్ ఏర్పాటు వ్యవసాయ రంగానికి ఎండ్రిన్ పోయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు డిస్కమ్ ఏర్పాటుపై తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (టీజీఈఆర్సీ) శుక్రవారం ఎర్రగడ్డలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ హియరింగ్‌లో కవిత పాల్గొని మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రైతులకు మంచి చేసే ఆలోచనే ఉంటే, గత ఆరు నెలలుగా ఈ విషయాన్ని ఎందుకు రహస్యంగా ఉంచారో చెప్పాలని నిలదీశారు. యావత్ తెలంగాణ రైతాంగానికి అన్యాయం చేసే ఈ ప్రయత్నాలను మానుకోవాలని, లేదంటే 1999 నాటి బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటం నాటి కాల్పుల ఘటనలను ప్రభుత్వం స్వయంగా కొని తెచ్చుకున్నట్లే అవుతుందని హెచ్చరించారు. ఏ విధంగానూ లాభసాటి కాని ఈ ప్రజా వ్యతిరేక ప్రతిపాదనను ఈఆర్సీ తక్షణమే తిరస్కరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

### రహస్య జీవోల వెనుక ప్రైవేటీకరణ కుట్ర

ఈ నిర్ణయం నిజంగానే రైతులకు మేలు చేసేదైతే ప్రభుత్వం ఎందుకు దాచిపెట్టిందని, ఈఆర్సీ ద్వారానే ఈ విషయం బయటకు వచ్చిందని కవిత గుర్తుచేశారు. ఇంతటి కీలకమైన అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అసెంబ్లీలో చర్చించకుండా రహస్యంగా వ్యవహరించడం వెనుక దురుద్దేశం ఉందన్నారు. ఇప్పటికే రూ. 25 వేల కోట్ల నష్టాల్లో ఉన్న డిస్కమ్‌ను కంపెనీ పేరుతో రిజిస్టర్ చేయడం వెనుక, భవిష్యత్తులో దీనిని ప్రైవేట్ పరం చేసే కుట్ర దాగి ఉందని ఆరోపించారు. రైతుల మోటార్లకు మీటర్లు పెట్టాలనే కేంద్ర ప్రభుత్వ షరతులన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోతోందని ధ్వజమెత్తారు. కొత్త డిస్కమ్‌కు 42 శాతం విద్యుత్ లోడ్‌ను బదిలీ చేస్తూ, దానికి తగినట్లుగా సిబ్బందిని కేటాయించకపోవడం వల్ల గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే నెలల తరబడి వేచి చూడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న రిపేర్ సెంటర్లను తాలూకా కేంద్రాలకు మారిస్తే రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారని, రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ బోర్ల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు.

### ప్రభుత్వ వైఫల్యాల వల్లే డిస్కమ్‌ల నష్టాలు

తెలంగాణ డిస్కమ్‌లకు మైనస్ 'సి' రేటింగ్ రావడానికి ఈ ప్రభుత్వ వైఫల్యమే కారణమని కవిత మండిపడ్డారు. డిస్కమ్‌లకు ఉన్న రూ. 69 వేల కోట్ల బకాయిల్లో రూ. 54 వేల కోట్లు ప్రభుత్వమే చెల్లించాల్సి ఉందన్నారు. ఆ నిధులు విడుదల చేస్తే డిస్కమ్‌ల ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందని హితవు పలికారు. ఇప్పటికే వేల కోట్లు పెండింగ్ పెట్టిన ప్రభుత్వం.. యూనిట్‌కు రూ. 6 ఖర్చయ్యే థర్మల్ విద్యుత్‌ను కొత్త డిస్కమ్‌కు కేటాయించి, అదనంగా వీలింగ్ ఛార్జీలు కూడా వేస్తామనడం హాస్యాస్పదమన్నారు. ఏసీ రూముల్లో కూర్చొని రైతుల భవితవ్యాన్ని తేల్చడం సరికాదని, రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

### ఆంధ్రా అధికారుల పెత్తనం సహించం

తెలంగాణ వచ్చిన తర్వాత 24 గంటల నిరంతర విద్యుత్ కోసం ఇక్కడి ఉద్యోగులు రాత్రింబగళ్లు కష్టపడితే, నేడు 1200 మంది తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు ప్రభుత్వం అన్యాయం చేసిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్టాలను పక్కనబెట్టి ఆంధ్రా నుంచి వచ్చిన 1700 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారని విమర్శించారు. జెన్‌కో, ట్రాన్స్‌కో, సదరన్ డిస్కమ్‌లలో ఆంధ్రా అధికారుల పెత్తనం పెరుగుతోందని, తెలంగాణ విద్యుత్ సంస్థల్లో అస్సలు ఆంధ్రావాళ్ల పెత్తనం ఉండొద్దని స్పష్టం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో రైతు డిస్కమ్ ఏర్పాటు చేయాల్సి వస్తే అందులో పూర్తిగా తెలంగాణ ఉద్యోగులనే నియమించాలని డిమాండ్ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వర్కవుట్ కాని ఈ రైతు డిస్కమ్ ప్రతిపాదనను ఈఆర్సీ తక్షణమే తిరస్కరించాలని కవిత కోరారు.

## రంగారెడ్డి జిల్లాలో నేడు కవిత పర్యటన

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రక్షణ సేన చీఫ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం రంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సామాజిక, పార్టీ కార్యక్రమాల్లో ఆమె పాల్గొననున్నారు. పర్యటనలో భాగంగా ఉదయం 10 గంటలకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన చిలుకూరు బాలాజీ ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు మొయినాబాద్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నారు. అదే కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించనున్నారు. తర్వాత ఉదయం 11.30 గంటలకు మొయినాబాద్ మండలం సొరంగల్ గ్రామంలో టీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో నిర్మించనున్న బస్టాప్‌కు శంకుస్థాపన చేయనున్నారు. కవిత పర్యటన నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమాలకు స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నట్లు సమాచారం.

## మహిళల ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా పథకాల అమలు

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### బ్యాంక్ లింకేజ్ రుణాలు, ధాన్యం కొనుగోలు కమిషన్ చెక్కుల పంపిణీ



**ప్రజానావ, సిరిసిల్ల :** మహిళల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మహిళా సంక్షేమ వారోత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్కే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా బ్యాంక్ లింకేజీ రుణాల మేళాలో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 337 మహిళా సంఘాలకు రూ.40కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు, ఇతర పథకాల కింద కోట్ల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న మహిళా సంఘాలకు కమిషన్ చెక్కులు కూడా అందజేశారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.57 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేశామని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాలకు బస్సులు, రైస్ మిల్లులు, ఎరువుల దుకాణాలు వంటి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ మహిళా సంఘాలు బ్యాంక్ రుణాలను ఉపాధి కార్యక్రమాలకు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు, వీర్నపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాములు నాయక్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

### వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం




**ప్రజానావ, సిరిసిల్ల :** జిల్లాలో జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై జిల్లా ఎస్పీ మహేష్ బి గితే, సంబంధిత అధికారులతో శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు పరేడ్ గ్రౌండ్ లో జరుగుతాయని, జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు , సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. వేడుకలకు సంబంధించి జెండా ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్ధం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకల డయాస్, సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వేడుకల వద్ద వైద్య బృందాలచే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, వేడుకలకు ఆహ్వాన పత్రాలు ప్రోటోకాల్ ప్రకారం ప్రతి ఒక్కరికీ అందాలని ఆదేశించారు. సిరిసిల్ల పట్టణంలోని స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు హాజరయ్యేలా మెప్మా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్య అతిథి అందించే సందేశం రూపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వివరాలను క్లుప్తంగా తయారు చేయాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ముఖ్య అతిథి గౌరవ వందనం, ఇతర బందోబస్తు ఏర్పాటు పకడ్బందిగా చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కలెక్టరేట్ ఏఓ రామ్ రెడ్డి, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ కాసర్ల పద్మ కన్నుమూత

### పట్టణ ప్రజల దిగ్భ్రాంతి.. కేటీఆర్ నివాళి

**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్ కాసర్ల పద్మ (61) శుక్రవారం వేకువ జామున తుది శ్వాస విడిచారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో జరిగిన మున్సిపల్ ఎన్నికలలో 27వ వార్డు నుండి బీఆర్ఎస్ పార్టీపై కౌన్సిలర్ గా ఎన్నికయ్యారు. గత పది రోజుల క్రితం గుండెపోటు రాగా శస్త్ర చికిత్స కోసం కరీంనగర్ లోని ఆసుపత్రిలో చికిత్స కొనసాగిస్తున్నారు. అక్కడ చికిత్స పొందుతూనే శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. గత 2000 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ గా ఎన్నికయ్యారు. తాజాగా రెండోసారి బీఆర్ఎస్ కౌన్సిలర్ గా ఎన్నికై ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ స్థితిలో కేవలం నాలుగు నెలల సమయం పాటు మాత్రమే ప్రజాసేవలో కొనసాగుతూ ప్రజలకు దూరం కావడం పట్ల పట్టణ ప్రజలు, ప్రజా ప్రతినిధులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. కాగా పద్మ భౌతికదేహం పై బీఆర్ఎస్ పార్టీ జెండాని కప్పి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులు, నాయకులు, శ్రేయోభిలాషులు హాజరై పద్మ కు నివాళి అర్పించారు.

### కేటీఆర్ హాజరు, పద్మ భౌతిక దేహానికి నివాళి

బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ కాసర్ల పద్మ మరణ వార్త తెలిసిన వెంటనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు శుక్రవారం హుటాహుటిన సిరిసిల్లకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ కాసర్ల పద్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు జిందం చక్రపాణి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, రజక సంఘం రాష్ట్ర నాయకులు అక్కరాజు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చోప్పదండి ప్రకాష్, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, పుర ప్రముఖులు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా పనిచేయాలి

### గడ్డం వెంకటస్వామి



**ప్రజానావ, ఖైరతాబాద్:** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని జూబ్లీహిల్స్ డివిజన్ సాగర్ సొసైటీ కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బీజేపీ ఆధ్వర్యంలో కీలక వర్క్‌షాప్ నిర్వహించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమంపై పార్టీ శ్రేణులకు అవగాహన కల్పిస్తూ బూత్ స్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై నాయకులు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ నియోజకవర్గ ఎస్ఐఆర్ (బీఎల్ఏ-1) ఇన్‌చార్జి గడ్డం వెంకటస్వామి మాట్లాడుతూ, బీఎల్ఏ-2లు, పోలింగ్ బూత్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు జరిగే ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ప్రతి పోలింగ్ బూత్‌లో అప్రమత్తంగా వ్యవహరించాలని, బీఎల్ఓలతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ తప్పులులేని, పారదర్శక ఓటరు జాబితా తయారీలో బీజేపీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. పోలింగ్ బూత్ పరిధిలో ఏ ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఇబ్బంది పడకుండా ప్రతి ఇంటికి చేరుకుని ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించాలని, బూత్ స్థాయిలో సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. "బలమైన బూత్ -- బలమైన బీజేపీ" అనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడు కాడి భోజరెడ్డి, రాష్ట్ర దళిత మోర్చా కార్యవర్గ సభ్యుడు సీతల అనిల్‌కుమార్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త నీరజ, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు చెలిమేటి గిరి, దొంగరి రాజకళ, ఉపాధ్యక్షుడు గురుబ్రహ్మ గౌడ్, కార్యదర్శి లలిత, కార్యవర్గ సభ్యుడు అరవింద్ గౌడ్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు, మోర్చా ప్రతినిధులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయడంలో బీజేపీ శ్రేణులు చురుకైన పాత్ర పోషించాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు.

## అనైతిక సంబంధంతో హత్య

**ప్రజానావ, ముంబై :** గోండియాలో కుటుంబ కలహాలు, అనైతిక సంబంధం కారణంగా రాజేంద్ర కత్రే (44) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. కుడ్వా ప్రాంతంలోని చోటా హనుమాన్ ఆలయం సమీపంలో ఆయన మృతదేహం అనుమానాస్పద స్థితిలో లభ్యమైంది. మృతుడి సోదరి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన రామ్‌నగర్ పోలీసులు, భార్య అనితా కత్రే తన ప్రియుడు సంజయ్ లిల్హారేతో కలిసి రాజేంద్రను గొంతు నులిమి హత్య చేసినట్లు గుర్తించారు. ఇద్దరినీ పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.


# భార్యను హత్య చేసి భర్త ఆత్మహత్య?

**తంగళ్లపల్లి మండలం మండేపల్లిలో విషాద ఘటన**

**కుటుంబ కలహాలే కారణమా..? పోలీసుల దర్యాప్తు**

**భార్య మృతితో భయపడి ఉరి వేసుకున్నట్లు అనుమానం**





**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామంలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. భార్యను హత్య చేసిన అనంతరం భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్న సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, మండేపల్లిలో అద్దె ఇంట్లో నివసిస్తున్న షర్ఫుద్దీన్ (60), ఆయన భార్య షాహీన్ (50) మధ్య కుటుంబ కలహాలు చోటుచేసుకున్నాయి. ఉపాధి హామీ పనుల నుంచి ఇంటికి వచ్చిన భార్యతో శుక్రవారం సాయంత్రం గొడవపడిన షర్ఫుద్దీన్, ఆమెపై దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో షాహీన్ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. అనంతరం జరిగిన ఘటనతో భయాందోళనకు గురైన షర్ఫుద్దీన్ ఇంట్లోనే దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, తంగళ్లపల్లి పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు షర్ఫుద్దీన్ స్వస్థలం జిల్లెల్ల గ్రామం కాగా, షాహీన్ స్వగ్రామం మండేపల్లి. దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉండగా వారికి ఇప్పటికే వివాహాలు జరిగినట్లు తెలిసింది. షర్ఫుద్దీన్ స్థానిక హోటల్‌లో పనిచేస్తుండేవాడని, మద్యానికి బానిసైనట్లు స్థానికులు చెబుతున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఈ ఘటన జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నప్పటికీ, పూర్తి వివరాలు దర్యాప్తులో తేలనున్నాయని తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.

# యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు

**ప్రత్యామ్నాయ మార్గంలో విద్యుత్ సరఫరా**

**సిరిసిల్ల ఎస్ఈ వేణు మాధవ్**

**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురువారం రాత్రి కురిసిన భారీ గాలివాన కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను టీజీఎన్‌పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ టి. వేణు మాధవ్ శుక్రవారం పరిశీలించారు. సిరిసిల్ల టౌన్-1, టౌన్-2 సెక్షన్ల పరిధిలోని అనంతనగర్, గాంధీనగర్, రాళ్లబావి, రెడ్డివాడ ప్రాంతాల్లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, లైన్ల పరిస్థితిని ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ ఇంజనీర్ అంజయ్య, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు శ్రీనివాస్, గోపీనాథ్, అసిస్టెంట్ ఇంజనీర్లు రుషిక, శ్రావంతి, టౌన్-1, టౌన్-2 సెక్షన్ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. భారీ గాలివాన ప్రభావంతో అనంతనగర్‌లో ఓ చెట్టు ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ పోల్ విరిగి కిందపడింది. సమాచారం అందుకున్న వెంటనే విద్యుత్ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని చెట్టును తొలగించారు. భద్రతా చర్యల్లో భాగంగా సంబంధిత డీటీఆర్ కనెక్షన్‌ను నిలిపివేసి, వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలగకుండా సమీప ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరాను ఏర్పాటు చేశారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల మార్పిడి, లైన్ల మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించిన అధికారులు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలను వేగవంతంగా కొనసాగిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్ఈ వేణు మాధవ్ అధికారులను ఆదేశించారు.

# తెలంగాణ బిడ్డలను ముట్టుకుంటే ఖబర్దార్

**ప్రొ. నాగేశ్వర్ రావును అరెస్ట్ చేస్తే తీవ్ర పరిణామాలు**

**మళ్లీ గో బ్యాక్ ఆంధ్ర ఉద్యమం చేపడతాం**

**జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరిక**




**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ బిడ్డలను ముట్టుకోవాలని ఆంధ్ర నుండి ఎవరైనా ప్రయత్నిస్తే, ఇక్కడ తీవ్ర పరిణామాలు ఉంటాయని, 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం మళ్లీ మొదలవుతుందని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. ప్రముఖ విశ్లేషకులు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావును విమర్శించే స్థాయి, అర్హత పవన్ కళ్యాణ్‌కు లేవని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. దమ్ముంటే తెలంగాణకు వచ్చి ప్రొఫెసర్ నాగేశ్వర్ రావును అరెస్ట్ చేయండి, అప్పుడు ఆయన ఇంటి ముందు అడ్డుగా నేను నిలబడతాను అంటూ పవన్ కళ్యాణ్‌కు సవాల్ విసిరారు. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు . పవన్ కళ్యాణ్‌ను ఒక ప్యాకేజ్ స్టార్ గా అభివర్ణించిన ఆయన, భవిష్యత్తులో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గనుక ఎక్కువ ప్యాకేజ్ ఇస్తే ఆయనకు కూడా సపోర్ట్ చేయడానికి పవన్ వెనకాడరని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకుల తీరుపై మండిపడుతూ.. 'మీరంతా ఉండేది, ఆస్తులు సంపాదించుకునేది హైదరాబాద్‌లోనే కదా, మరి అన్ని వేల కోట్లు పెట్టి అమరావతిని ఎందుకు కట్టుకుంటున్నారు?' అని అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలను తక్కువ చేసి మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని, రాజకీయాల కోసం ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడం సరికాదని హితవు పలికాడు.

# రిజిస్ట్రేషన్ల రద్దీ.. ఆఫీసుల హోరు!




- **మార్కెట్ విలువల పెంపు భయంతో కార్యాలయాలకు పోటెత్తుతున్న జనం**
- **రోజువారీ స్లాట్లు 40 నుంచి 80కి పెంపు, ఉదయం 9 నుంచి రాత్రి 7.30 గంటల వరకు సేవలు**

**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రభుత్వం త్వరలో ఆస్తుల మార్కెట్ విలువలను పెంచనుందన్న వార్తల నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. మార్కెట్ వాల్యూ పెరిగితే ఆ భారం తమపై పడుతుందన్న ఆందోళనతో, వీలైనంత త్వరగా భూములు, ఇళ్ల రిజిస్ట్రేషన్లను పూర్తి చేసుకునేందుకు కొనుగోలుదారులు బారులు తీరుతున్నారు. దీంతో గత కొద్ది రోజులుగా రిజిస్ట్రేషన్ ఆఫీసుల వద్ద విపరీతమైన రద్దీ వాతావరణం నెలకొంది. ప్రభుత్వ ధరలు సవరిస్తే, దానికి అనుగుణంగా రిజిస్ట్రేషన్ ఫీజులు, స్టాంప్ డ్యూటీల రూపంలో లక్షల రూపాయల అదనపు భారం పడే అవకాశం ఉంది. ఈ ఆర్థిక భారాన్ని తప్పించుకునేందుకే ప్రజలు ముందుస్తు రిజిస్ట్రేషన్లకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న రద్దీని సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు అప్రమత్తమయ్యారు. రిజిస్ట్రేషన్ల కోసం వస్తున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అలాగే డాక్యుమెంట్లు పెండింగ్ పడకుండా చూసేందుకు స్థానిక రిజిస్ట్రేషన్ అధికారి ఆఫీసర్ ఆర్.వి.వి. స్వామి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజల సౌకర్యార్థం రోజువారీ రిజిస్ట్రేషన్ స్లాట్ల సంఖ్యను భారీగా పెంచారు. సాధారణంగా రోజుకు 40 స్లాట్లకు మాత్రమే అవకాశం ఉండగా.. తాజా పరిస్థితుల దృష్ట్యా ఆ సంఖ్యను ఏకంగా 80కి పెంచినట్లు ఆయన వెల్లడించారు. అలాగే కార్యాలయ పనివేళలను సైతం పొడిగించారు. ఉదయం 9:00 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు నిరంతరాయంగా రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. అధికారులు తీసుకున్న తాజా నిర్ణయంతో రిజిస్ట్రేషన్ల కోసం నిరీక్షిస్తున్న వారికి భారీ ఊరట లభించినట్లయింది. స్లాట్ల సంఖ్యను రెట్టింపు చేయడం, సేవలను రాత్రి 7.30 వరకు పొడిగించడంతో కార్యాలయం వద్ద గందరగోళం, తొక్కిసలాట లాంటివి లేకుండా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సాఫీగా, వేగవంతంగా పూర్తవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# ఐదు రోజులుగా తాగునీటి కష్టాలు

- **బోర్ మోటార్లు పనిచేయక అవస్థలు పడుతున్న హన్మాజిపేట్ ప్రజలు**
- **అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేదని ఆవేదన**
- **వెంటనే నీటి సరఫరా పునరుద్ధరించాలని వార్డు ప్రజల డిమాండ్**



**ప్రజానావ, బాన్సువాడ:** కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని హన్మాజిపేట్‌లో తీవ్ర తాగునీటి సమస్య నెలకొంది. గ్రామపంచాయతీ సమీపంలోని 3వ వార్డులో ఐదు రోజులుగా ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వార్డులో ఉన్న రెండు బోర్ మోటార్లు పనిచేయకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలు లేక ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజల సమస్యల పట్ల స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మిషన్ భగీరథ ద్వారా కూడా ఈ వార్డుకు సరైన నీటి సరఫరా అందడం లేదని గ్రామస్తులు తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో బోర్ మోటార్లపైనే ఆధారపడాల్సి వస్తోందని, అవి కూడా పాడవడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. తాగునీరు వంటి ప్రాథమిక అవసరానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శించారు. వెంటనే పాడైన బోర్ మోటార్లను మరమ్మతు చేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని 3వ వార్డు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. "ప్రజల సమస్యలను పట్టించుకునే నాధుడే లేని గ్రామపంచాయతీగా హన్మాజిపేట్ మారిందా?" అంటూ గ్రామస్తులు అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## బస్టాండ్ వాష్‌రూమ్‌లో దొరికిన శిశువుకు

# 'ఆదర్శిని'గా నామకరణం

- **నెల రోజుల పాటు అధికారుల సంరక్షణలో చిన్నారి**
- **తల్లిదండ్రుల ఆచూకీ లభించకపోవడంతో కరీంనగర్ శిశు గృహానికి తరలింపు**
- **బారసాల నిర్వహించి పేరు పెట్టిన సంక్షేమ శాఖ అధికారులు**





**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వాష్‌రూమ్‌లో పుట్టిన వెంటనే వదిలివేయబడిన శిశువుకు అధికారులు శుక్రవారం బారసాల నిర్వహించి 'ఆదర్శిని' అని నామకరణం చేశారు. నెల రోజులుగా వైద్యులు, సంక్షేమ శాఖ సిబ్బంది సంరక్షణలో ఉన్న చిన్నారిని అనంతరం కరీంనగర్ శిశు గృహానికి తరలించారు. గత ఏప్రిల్ 23న సిరిసిల్ల కొత్త బస్టాండ్‌లోని వాష్‌రూమ్‌లో నవజాత శిశువును నిర్లక్ష్యంగా వదిలివేసిన స్థితిలో స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసుల సహాయంతో చిన్నారిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌కు సమాచారం అందించి, శిశువు సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అప్పటి నుంచి ఐసీపీఎస్, సీహెచ్‌ఎల్, సఖి బృందాల సభ్యులు చిన్నారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పర్యవేక్షణలో పుట్టినప్పుడు 1.5 కిలోల బరువున్న శిశువు ప్రస్తుతం 2.7 కిలోల బరువుకు చేరుకుని ఆరోగ్యంగా ఉందని తెలిపారు. చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉండటంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ సూచన మేరకు శుక్రవారం డిశ్చార్జ్ చేశారు. అనంతరం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు కరీంనగర్‌లోని శిశు గృహానికి తరలించారు. ఇదే సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి సూచనతో సీడబ్ల్యూసీ, మిషన్ వాత్సల్య సిబ్బంది, ఆసుపత్రి బృందం కలిసి చిన్నారికి 'ఆదర్శిని' అని పేరు పెట్టి బారసాల కార్యక్రమం నిర్వహించారు. శిశువు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లభించలేదని జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం తెలిపారు. చిన్నారికి అవసరమైన సంరక్షణ, భద్రత కల్పించేందుకు శిశు గృహానికి తరలించినట్లు వెల్లడించారు.

# పొగాకు వాడకాన్ని నివారించేందుకు చర్యలు

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం**




**ప్రజానావ, సిరిసిల్ల :** జిల్లాలో పొగాకు వాడకం నివారించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 31వ తేదీ ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి నిర్వహించారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వివిధ శాఖల వారు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించాలని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలని, అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు మహిళలు, యువత, రైతులను భాగస్వామ్యం చేస్తూ పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించాలని ఆదేశించారు. పొగాకు ఉత్పత్తుల చట్టం ప్రకారం 18 సంవత్సరాల కంటే చిన్న పిల్లలకు అమ్మడం నేరమని, ఈ చట్టాలు పకడ్బందీగా అమలయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, లేబర్ ఆఫీసర్ నజీర్ అహ్మద్, ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష, ఎన్జీఓ మెంబర్ చింతోజు భాస్కర్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

